భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0 - కనిష్ఠం : 25.0
తణుకు : 32.0 - 25.0



విద్యుత్ విభజన

- పశ్చిమకు ఈపీడీసీఎల్ ఎస్ఈ పోస్టు
- మూడు డివిజన్లతో భీమవరంలో ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం
- కొత్త ఎస్ఈగా రఘునాథ్‌బాబు



నరసాపురం, సెప్టెంబరు 26 : పశ్చిమకు ఈపీడీసీఎల్ ప్రత్యేకంగా కొత్త ఆపరేషన్ సర్కిల్‌ను మంజూరు చేసింది. సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) పోస్టును కేటాయించడంతోపాటు తొలి ఎస్ఈగా రఘునాథ్‌బాబును నియమిస్తూ ఈపీడీసీఎల్ సీఎండీఉత్తర్వులు జారీచేశారు. దీంతో పశ్చిమకు జిల్లా కేంద్రంగా ఉన్న భీమవరంలో కొత్త ఎస్ఈ కార్యాలయం ప్రారంభం కానుంది. ఈ సర్కిల్ కార్యాలయ పరిధిలోకి జిల్లాలోని నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం డివిజన్లు రానున్నాయి. జిల్లా విభజన జరిగి మూడేళ్లు గడిచింది. చాలా కార్యాలయాలు ఇంకా ఉమ్మడి జిల్లాలోనే కొనసాగుతున్నాయి. ఇందులో ఈపీడీసీఎల్‌కు సంబంధించి సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం ఒకటి. ఇప్పటి వరకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాకు ఒక ఎస్ఈ పనిచేసేవారు. రెండు జిల్లాలకు ఒకే స్టోర్ ఉండేది. ట్రాన్స్‌ఫారం, ఇతర కరెంట్ సామగ్రి ఏలూరు నుంచే తెచ్చుకోవాల్సి వచ్చేది. జిల్లాలోని ఐదు డివిజన్ల పర్యవేక్షణ కూడా ఎస్ఈ పరిధిలోనే ఉండేది. దీనివల్ల అధికారులు, వినియోగదారులు అనేక ఇబ్బందులు పడేవారు. ఎస్ఈని కలవాలంటే ఏలూరు వెళ్లాల్సి వచ్చేది.

కొత్త ప్రభుత్వం రాకతో విభజన...

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఇంకా విభజన కాని కొన్ని శాఖల కార్యాలయాలపై దృష్టి సారించింది. ప్రధానంగా ఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం ఇంకా ఉమ్మడి జిల్లాలోనే ఉండటాన్ని గుర్తించింది. రెండు జిల్లాలకు వేర్వేరూ ఎస్ఈలను నియమించాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈపీడీసీఎల్ సీఎడీ రెండు జిల్లాలకు వేర్వేరు ఎస్ఈలను నియమించారు. ఇక నుంచి నరసాపురం, పాలకొల్లు, పెనుగొండ, తణుకు, టీపీగూడెం, భీమవరం, ఉండి సబ్ డివిజన్లు, భీమవరం, నరసాపురం, టీపీగూడెం డివిజన్ కార్యాలయాలు ఈ ఎస్ఈ కార్యాలయ పరిధిలోకి వస్తాయి. అయితే ఇంకా స్టోర్స్‌ను వేరు చేయలేదు. రెండు జిల్లాలకు ఒకే స్టోర్స్ మరింత కొంతకాలం కొనసాగనుంది.



ఆకివీడులో బీఎల్‌వోల నిరసన

పనిచేయించుకుని డబ్బులివ్వరా ?

ఆకివీడు, సెప్టెంబరు 26 : 'నాలుగేళ్లుగా బీఎల్‌వోలు విధులు నిర్వహిస్తున్నాం. కాని, చేసిన పనికి మాత్రం డబ్బులు ఇవ్వడం లేదు. జిల్లాలో 1,461 మంది బీఎల్‌వోలకు మూడేళ్లుగా రెండు కోట్ల 62 లక్షల 98 వేల బకాయి చెల్లించాల్సి వుంది. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు సంబంధించి మాతో పని చేయించుకుని డబ్బులు తర్వాత ఇస్తామన్నారు. ఇప్పటికి ఇవ్వలేదు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలంటూ ఇంటింటి సర్వే చేయిస్తున్నారు. మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులకు సర్వే పత్రాలందించే సమయంలో భీమవరం, ఉండి వెళ్లి అనేకసార్లు ప్రమాదాలకు గురయ్యేవాళ్లం. బస్సులకు, వాహనాలపెట్రోలు ఛార్జీలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసేవారు. ఎన్నికల ఖర్చు రూ.2,000 ఇచ్చి సరిపెట్టుకోమనేవారు. మాకు వచ్చే అరకొర జీతాల్లోనే డబ్బులు ఖర్చు పెట్టుకొనే వాళ్లం. ఏడాదికి ఒక్కొక్కరికి రూ.6 వేలు చొప్పున ఐదేళ్లకు రూ.30 వేలు వస్తాయన్నారు. ఒక్కొక్కరికి రూ.4 వేలు మాత్రమే చెల్లించారు. మిగిలిన సొమ్ములు ఇప్పించాలి' అంటూ గురువారం ఆకివీడు తహశీల్దార్ కార్యాలయం దగ్గర బీఎల్వోలు నిరసన వ్యక్తంచేశారు.

ప్లాస్టిక్ కవర్లపై నిషేధం

భీమవరంలో వచ్చే నెల నుంచి



- 120 మైక్రాన్‌లకన్నా తక్కువ కవర్లు వినియోగిస్తే భారీ జరిమానాలు
- మునిసిపాల్టీ నుంచి షాపులకు సమాచారం, హెచ్చరికలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 26 : జిల్లా కేంద్రమైన భీమవరంలో ప్లాస్టిక్ భూతం పనిపట్టేందుకు మునిసిపల్ అధికారులు కొరడాను ఝళిపించనున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతోనిషే. ధాన్ని కఠినంగానే అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన ఇప్పటికే సేకరించారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు విక్రయించే హోల్‌సేల్, రిటైల్ షాపులు ఎన్ని, ఎక్కడ ఉన్నాయో ఆరా తీశారు. వాటిలో రోజువారీ వినియోగం ఎంత ఉందో తెలుసుకున్నారు. ఇప్పటికే పట్టణంలోని 1200 షాపులకు ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై సమాచారాన్ని అందించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించుకోవాలని 15 రోజులుగా ప్రచారం చేశారు. 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ కవర్లు అమ్మినా, ఇచ్చినా తనిఖీల్లో దొరికితే కఠిన చర్యలతోపాటు భారీ జరిమానా విధిస్తామని వ్యాపార సంస్థలకు సమాచారం అందించారు. ఇక నుంచి మైక్ ద్వారా ప్రచారం చేయనున్నారు. ఇప్పటికే ఏ షాపుల్లో కవర్లు విక్రయిస్తున్నాయి, వారికి సరుకు ఎక్కడి నుంచి వస్తుంది, వంటి విషయాలను తెలుసుకున్నారు.

2014 నుంచి 19 వరకు

2014 నుంచి 2019 వరకు సాగిన టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని పూర్తిస్థాయిలో అమలు చేశారు. ఇందుకు మునిసిపల్ కౌన్సిల్ దృష్టి పెట్టింది. అప్పటి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, మునిసిపల్ ఛైర్మన్ కొటికలపూడి గోవిందరావు పర్యవేక్షణలో కౌన్సిల్ సహకారంతో నిషేధాన్ని పూర్తిస్థాయిలో అమలుకు చర్యలు తీసుకున్నారు. దీంతో చాలాకాలం ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గింది. భారీగా జరిమానాలు విధించటంతోపాటు, ఇతర ప్రాంతాల నుంచి సరుకు పట్టణంలోకి వస్తే వాటిని పట్టుకుని మునిసిపాల్టీలకు తరలించేవారు. తనిఖీలు పూర్తిస్థాయిలో ఉండేవి. చివరిలో అధికారులు కాస్త మెత్తబడటంతో మళ్లీ వినియోగం ప్రారంభమైంది.

ఐదేళ్లలో అంతంతమాత్రమే

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్లాస్టిక్ నిషేధం పట్టణంలో దాదాపు కనుమరుగైంది. కౌన్సిల్ పాలన లేకపోవడంతో అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా వినియోగం భారీగా పెరిగింది. కనీస తనిఖీలు లేవు. జరిమానాలు లేవు. చేసినా తూతూమంత్రంగా జరిగేవి. ప్లాస్టిక్‌ను నిషేధించే వారు కరువయ్యారు. దీని ప్రభావంతో పట్టణంలో ఏ రోడ్డుపై చూసినా, ఏ కాల్వలో చూసిన ప్లాస్టిక్ కవర్లే ఎక్కువగా కనిపిస్తాయి.

ఈ సారైనా అమలు జరిగేనా ?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి కవర్ల నిషేధం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం అధికారుల పాలనలో మునిసిపాల్టీ కొనసాగుతోంది. ఉదయమై చాలు కవరు లేకుండా ఏ పని జరగని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో పూర్తిస్థాయిలో అమలు జరుగుతుందా ? అనేది ప్రశ్నార్థకమే. రాజకీయ వత్తిళ్లు లేకపోతే అధికారులు చొరవ తీసుకునే అవకాశం ఉంది. అధికారులు ఇచ్చిన గడువు దసరా పండుగ వరకు ఉంటుంది. ఆ తర్వాత ఎలా తనిఖీలు చేసి నిషేధం అమలు చేస్తారో అనేది చూడాలి.



కొంతేరులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో సామూహిక సీమంతాలు చేస్తున్న మంత్రి రామానాయుడు

జగన్.. ఏ మొహం పెట్టుకుని తిరుమల వెళతావ్ : మంత్రి నిమ్మల విమర్శ

యలమంచిలి, సెప్టెంబరు 26 : వంద ఎలుకలు తిన్న పిల్లి కాశీ యాత్రకు బయలుదేరినట్లు వైఎస్ జగన్ తిరుమలకు బయలుదేరుతున్నాడని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. యలమంచిలి మండలం కొంతేరులో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ తిరుమలను అపవిత్రం చేసిన జగన్ ఏ మొహం పెట్టుకుని అక్కడకు వెళతాడు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసిన జగన్‌ను తిరగనివ్వకుండా ప్రజలే అడ్డుకోవాలి' అని పిలుపునిచ్చారు. జగన్ రాష్ట్రం మొత్తం మీద రూ.14 లక్షల కోట్లు అప్పులు పెట్టి ప్రతి వ్యక్తి నెత్తి మీద రూ.2.40 లక్షల అప్పు పెట్టాడన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సామూహిక సీమంతాలు చేసి, చీర, గాజులు, పసుపు, కుంకుమ అందించి ఆశీర్వదించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, కడలి గోపి, చెరుకూరి అంజిబాబు, మాతా రత్నంరాజు, గంటా శ్రీను, హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మార్టేరులో గర్భిణికి మిఠాయిలు అందిస్తున్న ఎమ్మెల్యే పితాని

వలంటీర్లు.. వైసీపీ ఏజెంట్లు : ఎమ్మెల్యే పితాని

పెనుమంట్ర/ఆచంట, సెప్టెంబరు 26: 'గత ప్రభుత్వ హయాంలో సోషల్ మీడియాలో ఎవరైనా వ్యతిరేకంగా పోస్టులు పెడితే సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని వలంటీర్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవారు. వారు వలంటీర్లు కాదు.. వైసీపీ కార్యకర్తలు. ప్రజలకు సేవ చేయడం మానేసి, పార్టీ కార్యక్రమాలు చేపట్టి ఇబ్బందులు పెట్టారు. ప్రస్తుతం వారు గాలిలో కలిసిపోయారు. అలాగే సచివాలయ సిబ్బంది తమ పనితీరు మార్చుకోవాలి. లేకపోతే రాబోయే రోజుల్లో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇటీవల ఎన్నికల్లో సచివాలయ సిబ్బంది కూటమి పార్టీలకు ఓట్లు వేయలేదు' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ఆచంట మండలం పెనుమంచిలి, పెనుమంట్ర మండలం మార్టేరులో శుక్రవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. పెనుమంచిలిలో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, హైస్కూల్‌లో సైకిల్ షెడ్డు, ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ గణేషుల శేషవాణి, జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్‌కు ఊపిరి

కొన్ని పాఠశాలల్లో టీచర్ల నియామకాలకు అవకాశం

ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. పలు కారణాలతో నియామకాలు నిలిచిన కొన్ని ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలపై స్పందించిన ప్రభుత్వం సంబంధిత విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ ఖాళీలను నింపేందుకు షరతులతో కూడిన అనుమతులు ఇవ్వనుంది.

- కొత్తగా పోస్టులు అవసరమైతే ప్రభుత్వ 'సర్‌ప్లస్' ఉపాధ్యాయులతో సర్దుబాటుకు చాన్స్
- జగన్ దెబ్బకు ఎయిడెడ్ విధ్వంసం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 26: ఏలూరు జిల్లా భీమడోలు మండలం ఆగడాలలంక ప్రాథమిక పాఠశాలలో రెండు ఎస్జీటీ పోస్టులు, పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు సీబీసీఎన్‌సీ హైస్కూలులో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కలిపి 11, అదే యాజమాన్యానికి చెందిన మరో ప్రాథమిక పాఠశాలలో మూడు ఎస్జీటీ పోస్టుల భర్తీకి విద్యాశాఖ చర్యలు తీసుకోనుంది. మరికొన్నింటిలోను టీచరు ఖాళీలను భర్తీచేసే అవకాశం లేకపోలేదు. ఈ ఖాళీలను సంబంధిత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని భర్తీని చేపడతారు. అయితే కేవలం కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేసిన ఎయిడెడ్ పాఠశాలల్లో మాత్రమే ప్రస్తుతానికి నియామకాలు పరిమితమని తెలుస్తోంది. దీనిపై అధికారిక సమాచారమేదీ తమ వద్ద లేదని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

ప్రస్తుత 'ఎయిడెడ్' పరిస్థితి ఇదీ

ఏలూరు జిల్లాలో 18 ఎయిడెడ్ పాఠశాలలుండగా, మొత్తం 3,546 మంది విద్యార్థులున్నారు. వీటిలో 11 ప్రాథమిక పాఠశాలల్లో 50 శాంక్షన్ ఎస్జీటీ పోస్టులకు ప్రస్తుతం 21 మంది వర్కింగ్ టీచర్లున్నారు. ఇక 7 ఉన్నత పాఠశాలల్లో 165 స్కూల్ అసిస్టెంట్ కేడర్ శాంక్షన్ పోస్టులకు ప్రస్తుతం 58 పోస్టుల్లో మాత్రమే టీచర్లు పనిచేస్తున్నారు. చివరిసారిగా ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ నియామకాలను 2003లో అప్పటి ప్రభుత్వం నిలిపివేసింది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 84 ఎయిడెడ్ యాజమాన్యాలు కోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకోవడంతో తదుపరి సంవత్సరాల్లో కొన్నింటిలో నియామకాలు జరిగాయి. కొన్నింటిలో పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా జరిగే ఎయిడెడ్



నియామకాలన్నీ ఇదే కోవలోకి వస్తాయని తెలుస్తోంది. ఇప్పుడు కొత్తగా ఏదైనా ఎయిడెడ్ యాజమాన్యం తమకు టీచర్ పోస్టులు కావాలంటూ ప్రభుత్వాన్ని లేదా కోర్టుని ఆశ్రయిస్తే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సర్‌ప్లస్ (మిగులు)గా వున్న సుమారు 400 ఎస్జీటీ ఉపాధ్యాయులను సర్దుబాటుపై నియమించే అవకాశాలు వున్నట్టు సమాచారం. అయితే సంబంధిత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. వీటన్నింటిపైనా ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. పశ్చిమ గోదావరి జిల్లాలో 14 ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలుండగా 2004 మంది విద్యార్థులున్నారు. మూడు యూపీ స్కూళ్లు ఉండగా 135 మంది విద్యార్థులు, 12 ప్రాథమిక స్కూళ్లు ఉండగా 421 మంది విద్యార్థులున్నారు.

జగన్ దెబ్బకు విలవిల

- రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యాసంస్థల ఆస్తులపై కన్నేసిన గత ప్రభుత్వం 2021లో తీసుకున్న నిర్ణయం ఎయిడెడ్ విద్యా వ్యవస్థను కుదిపేసింది. ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రభుత్వంలోకి విలీనం చేయాలంటూ బలవంతంగా ఒప్పించే ప్రయత్నం చేయడం పెద్ద దుమారాన్నే రేపింది. జగన్ ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ పలుచోట్ల విద్యార్థుల తల్లిదండ్రులు నిరసనలకు దిగారు. దీంతో రెండు ఆప్షన్ల విధానాన్ని తెరపైకి తెచ్చారు.
- ఆప్షన్-1 ప్రకారం ఎయిడెడ్ విద్యా సంస్థకు సంబంధించిన ఆస్తులు, అందులో పనిచేస్తున్న టీచర్లతో సహా ప్రభుత్వానికి అప్పగించాలి. ఈ ఆప్షన్‌కు అయిష్టంగా ఉమ్మడి జిల్లాలో ఎనిమిది పాఠశాలలు, 12 టీచరు పోస్టులను యాజమాన్యాలు ప్రభుత్వానికి అప్పగించాయి.
- ఆప్షన్-2ని ఆమోదించిన 138 పాఠశాలల యాజమాన్యాలు ఆస్తులను తమ వద్దే ఉంచుకుని, వాటిలో పనిచేస్తున్న 219 మంది టీచర్ల ను ప్రభుత్వానికి అప్పగించాయి. విలీనమైన వారందరినీ జీరో సర్వీసుతో ప్రభుత్వ పాఠశాలలకు 2022 మార్చిలో సర్దుబాటు చేశారు. జీరో సర్వీసు వల్ల అత్యధికంగా నష్టపోయిన టీచర్లలో ఆర్‌సీఎం యాజమాన్యానికి చెందిన వారే ఉన్నారు. వీరంతా కౌన్సెలింగ్‌లో సుదూర ప్రాంతాలకు బదిలీపై వెళ్లాల్సివచ్చింది. కళాశాల విద్యలోనూ ఇదే దుస్థితి ఏర్పడింది.
- ప్రభుత్వంలోకి విలీనం చేసిన ఎయిడెడ్ విద్యాసంస్థలకు కొత్తగా టీచరు పోస్టులను మంజూరు చేయడం లేదా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న(ఎయిడెడ్) టీచర్లను తిరిగి ఆయా పాఠశాలలకు వెనక్కి పంపడం సాంకేతికంగా సాధ్యం కాదని చెబుతున్నారు.



మాధవాయిపాలెం వంతెనపై నుంచి ప్రవహిస్తున్న ఎర్రకాలువ నీరు

భారీ వర్షాలు.. పొంగుతున్న ఎర్ర కాలువ



కలెక్టర్ నాగరాణికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్/భీమవరం టౌన్, సెప్టెంబరు 26 : ఎగువన కురుస్తున్న వర్షాలకు తాడేపల్లిగూడెం మండలంలో పొంగి ప్రవహిస్తోంది. మాధవరం- కంసాలిపాలెం మధ్య వంతెనపై నుంచి నీటి ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచిపోయాయి. పెరుగుతున్న ప్రవాహంతో మళ్లీ ఎక్కడ, ఎప్పుడు వరి చేలను ముంచుతుందోనని రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఎర్ర కాలువ వరదలకు ఏటా వేలాది ఎకరాల వరి పంట ముంపునకు గురవుతోందని, దీనికి శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కలెక్టర్ చదలవాడ నాగరాణిని కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమెను కలిసి వినతి పత్రం అందించారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు.

సార్‌కు గిఫ్ట్ కొనాలి.. రూ.5వేలు ఇవ్వండి!

జీలుగుమిల్లి, సెప్టెంబరు 26 : 'సార్.. బదిలీ అయ్యారుగా.. ఆయనను గురువారం సన్మానిస్తున్నాం. వెండి, బంగారు వస్తువులను బహుమతిగా ఇస్తున్నాం. ఇందుకు ఒక్కొక్కరు ఐదు వేలకు తక్కువ కాకుండా ఇవ్వండి' అంటూ జీలుగుమిల్లి వెలుగు సిబ్బంది వసూళ్లకు పాల్పడడం వివాదాస్పదమైంది. సాధారణంగా ఓ అధికారి బదిలీ సమయంలో సిబ్బంది సన్మానించడం సహజమే. కాని, ఇక్కడ ఆ అధికారి బదిలీ వీవోఏలను ఇబ్బందుల పాలు చేసింది. వీవోఏలంతా ఐదు వేలు చొప్పున నగదు ఇచ్చారు. కాని ఓ వీవోఏ తన ఆర్థిక పరిస్థితి బాగా లేదని రూ.నాలుగు వేలే ఇచ్చింది. దీనిపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐదు వేలు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అసలే ఎనిమిది నెలలుగా జీతాలు రాని వీవోఏలు కొందరు అప్పులు చేసి మరీ చెల్లించారు. దీనిపై బదిలీ అయిన ఆ అధికారిని ఫోన్‌లో వివరణ అడగ్గా తనకు ఎటువంటి గిఫ్టులు ఇవ్వలేదని శాలువా కప్పి సత్కరించినట్టు చెప్పారు. కాని, వీవోఏలు మాత్రం తాము రూ.5 వేలు ఇచ్చినట్టు చెబుతున్నారు.

ఐదుగురు ఆర్డీవోల బదిలీ

- భీమవరం : కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి
- తాడేపల్లిగూడెం : భవాని శంకరి
- నరసాపురం : దాసి రాజు
- ఏలూరు : అంబరీష్
- నూజివీడు : ఎం.వాణి

భీమవరం/ఏలూరు సిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో పనిచేస్తున్న ఐదుగురు రెవెన్యూ డివిజన్ అధికారులను(ఆర్డీవో) బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సెలవులోవున్న తాడేపల్లిగూడెం ఆర్డీవో చెన్నయ్యను బదిలీ చేస్తూ ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఆయన స్థానంలో నూజివీడు డిప్యూటీ కలెక్టర్ వై.భవాని శంకరిని ఇక్కడ నియమించారు. భీమవరం ఆర్డీవో శ్రీనివాస్‌రాజు బదిలీపై కుప్పం వెళ్లగా, ఆయన స్థానంలో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని నియమించారు. ఉయ్యూరు ఆర్డీవోగా పనిచేస్తున్న దాసి రాజును నరసాపురం ఆర్డీవోగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న అంబరీష్‌ను ఏలూరు ఆర్డీవోగా బదిలీ చేశారు. మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణిని నూజివీడు ఆర్డీవోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

రథం భద్రమేనా ?

- వరుస ఘటనలతో అధికారులు అప్రమత్తం
- సీసీ కెమెరాలు, రక్షణ షెడ్‌లపై ఆరా

భీమవరం క్రైం, సెప్టెంబరు 26 : దేవాలయాలు వాటి పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆలయాల్లో జరుగుతున్న కొన్ని ఘటనలను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశించింది. దేవాలయాల వద్ద ఉంటున్న రథాల రక్షణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలతో పోలీస్ శాఖ నిఘా పెంచింది. రథాలకు రక్షణ ఎలా ఉంది పరిశీలించి నివేదిక ఇవ్వాలని గ్రామ, వార్డు సచివాలయాల్లోని మహిళా పోలీసులను ఆదేశించింది.

జిల్లాలో 50 రథాలు

పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆలయాలకు నర్సాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 16, భీమవరం పరిధిలో 18, తాడేపల్లిగూడెం పరిధిలో 16 రథాలు ఉన్నాయి. ఈ రథాల వద్ద వాచ్‌మెన్‌లు వున్నారా ? సీసీ కెమేరాలు ఉన్నాయా ? రక్షణకు షెల్టర్‌లు నియమించారా ? అనే విషయాలను మహిళా పోలీసుల ద్వారా పోలీస్ శాఖ వివరాలు సేకరిస్తోంది. రెండు రోజుల క్రితం అనంతపురం జిల్లాలో ఒక దేవాలయం వద్ద ఉన్న రథాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఐదేళ్ల క్రితం అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ రథాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారు. ఎనిమిదేళ్ల క్రితం భీమవరం పంచారామం అయిన సోమేశ్వరస్వామి దేవాలయం వద్ద ఉన్నరథాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే తగలబెట్టారు. ఇలా రథాలపై కొందరు కావాలని చేస్తున్న ధ్వంసాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఎటువంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టింది. తిరుమల లడ్డూ వివాదం జరుగుతున్న నేపథ్యంలో దీనిపైన చర్యలు తీసుకుంటుంది.

కట్టుదిట్టమైన చర్యలు : డీఎస్పీ జయసూర్య

దేవాలయాల వద్ద రథాలపై ఎలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. పోలీస్ ఉన్నత అధికారుల ఆదేశాలతో రథాల వద్ద సీసీ కెమెరాలు, వాచ్‌మెన్‌లు, షెడ్‌ల నిర్మాణాలపై ఆరా తీస్తున్నాం. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో చర్యలు చేపట్టాం. ఆలయ కమిటీలు, సభ్యులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి రథాల రక్షణపై చర్చిస్తాం. ఎవరైనా ఆకతాయిలు, విధ్వంసకారులపై అనుమానం వస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.



డిప్యూటీ తహసీల్దార్ సాగర్ డిస్మిస్



ఏలూరు రూరల్, సెప్టెంబరు 26: ఏలూరు డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మాజీ ఎన్జీవో అధ్యక్షుడు ఎల్వీ సాగర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు జారీ చేశారు. సాగర్ కొన్నేళ్ల కిందట ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ డీటీగా పనిచేస్తూ అప్పటి కలెక్టర్ కాటమనేని భాస్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఆయనను సస్పెండ్ చేశారు. అనంతరం కొన్నేళ్ల తరువాత సాగర్ ఐటీడీఏ కోట రామచంద్రపురం డీటీగా, ఏలూరు ఎన్నికల విభాగం డీటీగా పనిచేశారు. ఆయనపై అనేక అవినీతి ఆరోపణలతో పాటు పనిచేసిన కాలంలో రేషన్‌షాపుల వద్ద లంచాలు తీసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం నిర్ణయిం చింది. సాగర్ ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. తాజాగా ఆయనను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.





జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి పొందిన చిత్రం... కళాశాల విద్యార్థుల విభాగంలో ప్రథమ బహుమతి గెలుచుకున్న చిత్రం

'గాంధీతత్వం' చిత్రలేఖన పోటీ విజేతలు వీరే

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 26 : మహాత్మాగాంధీ 156వ జయంతి పురస్కరించుకుని 'గాంధీతత్వం'పై సర్వోదయ మండలి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీ విజేతల జాబితాను మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం విడుదల చేశారు. సీనియర్స్ విభాగంలో టెపిని (భీమవరం), ఎ.శ్రీవర్షిణి (మేడపాడు), ఎస్.ప్రజ్ఞ తపస్విరెడ్డి (నిడదవోలు) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. జూనియర్స్ విభాగంలో సీహెచ్.భవిష్ (వేలివెన్ను), టి.భార్గవ్ (ఏలూరు), గాయత్రి (శనివారపుపేట), సబ్ జూనియర్స్ విభాగంలో పి.మోక్షిత (ధర్బగూడెం), ఏ.వి.సాయిస్వాగత్ (నందమూరుగర్వు),కె.గంగహామిని (దండగ్ర) విజేతలుగా నిలిచారు. కళాశాల విద్యార్థుల విభాగంలో శ్యామలగౌరి (భీమవరం), నిహారిక (ఏలూరు), కె.హర్ష (బుట్టాయగూడెం) విజేతలుగా నిలిచారని వివరించారు. విజేతల్లో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందినవారికి అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద, ఏలూరు జిల్లావారికి 2న ఉదయం 10 గంటలకు పెదనిండ్రకొలను మహాత్మాగాంధీ భవనం వద్ద, తూర్పు గోదావరి జిల్లావారికి మధ్యాహ్నం 2 గంటలకు మల్లవరం గాంధీ ఆశ్రమం వద్ద నిర్వహించే కార్యక్రమాల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

చిన్నారి చేతనకు కలెక్టర్ అభినందన



భీమవరంటౌన్, సెప్టెంబరు 26 : భీమవరానికి చెందిన చిన్నారి బొలిశెట్టి చేతన గత ఏప్రిల్‌లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో రికార్డు సాధించిన బొలిశెట్టి చేతనను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగ రాణి అభినందించారు. మే నెలలో మైసూర్ దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంది. ఇప్పుడు వరల్డ్ రికార్డు సాధించింది. 8 సంవత్సరాల 2 నెలల వయసులోనే ద్వారకాతిరుమల, అప్పనపల్లి, సింహాచలం, అంతర్వేది, అన్నవరం, వాడపల్లి వంటి ప్రముఖ ఆలయాలతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 108 ప్రదేశాల్లో 108 సార్లు భగవద్గీత శ్లోకాలు తెలుగు అర్థాలతో పాటు పారాయణ చేసి అంతర్జాతీయ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో స్థానం సాధించినందుకు చేతనను కలెక్టర్ అభినందించారు..



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

స్కూల్ గేమ్స్‌లో రేలంగి విద్యార్థుల ప్రతిభ

ఇరగవరం, సెప్టెంబరు 26 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనపరచాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. స్కూల్‌గేమ్స్‌లో కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో రేలంగి ఉన్నత పాఠశాల విద్యార్థులు 19 మంది ప్రతిభ కనబరచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న రైతు సంఘ నాయకులు

ద్వారకాతిరుమలలో నేడు రాష్ట్ర రైతు సదస్సు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 26: ద్వారకాతిరుమలలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరుగునున్న రాష్ట్ర రైతు సదస్సు విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్‌లు కోరారు. గురువారం సదస్సు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ద్వారకాతిరుమల యాదవ కల్యాణమండప ఆవరణలో సదస్సు జరుగుతుందని వివరించారు. సదస్సు అనంతరం మూడురోజుల పాటు జరిగే రాష్ట్ర కార్యకర్తల శిక్షణా తరగతుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 150 మంది పాల్గొంటారని వివరించారు.సదస్సుకు మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, నేతలు శ్రీనివాసరావు, వి.కృష్ణయ్య, పలు రైతు సంఘనేతలు పాల్గొంటారన్నారు.

కొవ్వలి బీసీ వసతి గృహంలో సదుపాయాలు కల్పించాలంటూ ఆందోళన



విద్యార్థి సంఘం నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ స్వామి

దెందులూరు, 26 సెప్టెంబరు : కొవ్వలి బీసీ బాలుర వసతి గృహంలో విద్యా ర్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ వివాదం పెరగడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. దెందులూరు మండలం కొవ్వలి బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థి సంఘం నాయకులు విద్యార్థులతో కలిసి గురువారం నిరసన చేపట్టారు. విద్యార్థులను పాఠశాలకు వెళ్లానివకుండా అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఇబ్బందులు తలెత్తాయని మీడియా ముందు చెప్పడంతో కొవ్వలి టీడీపీ నాయకుడు రామకృష్ణ, కొంతమంది వసతి గృహానికి చేరుకున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లలో నిధులు కేటాయించలేదని గత టీడీపీ ప్రభుత్వంలో 300 పిల్లలు ఉండేవారిని ఇప్పుడు 50 మంది మాత్రమే ఉన్నారని, కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు కాకుండానే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దీంతో వివాదం రాజకీయ రంగు పులుముకోవడంతో దెందులూరు ఎస్ఐ స్వామి తమ సిబ్బందితో వచ్చి విద్యార్థి సంఘం నాయకులు, టీడీపీ నాయకులను అక్కడ నుంచి పంపించి వేశారు. దీనిపై కొవ్వలి వసతిగృహం అధికారి సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ కొంత మంది విద్యార్థి సంఘం నాయకులు డబ్బులు డిమాండ్ చేశారని ఇవ్వనందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

రూ.10 నాణేనికి ఏమైంది !





తిరస్కరిస్తున్న వ్యాపారులు..జనం
రూ. 10 నోట్లకు కొరత వచ్చింది..
ఇప్పుడు..నాణేలే దిక్కు
తీసుకోకపోతే ఫిర్యాదు చేయండి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 26: పది రూపాయల నాణేన్ని జనం బాన్ చేశారు. వాటిని తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. అసలు రూ.10 నాణెం ఎందుకు వద్దంటున్నారని అడిగితే సమాధానం మాత్రం దొరకడం లేదు..నాణేల వినియోగంపై ఆర్బీఐ ఎటువంటి ప్రకటన చేయకపోయి కొన్నాళ్లుగా వ్యాపారులు వీటిని తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో, పెట్రోల్ బంకుల్లో , దుకాణాల్లో సైతం తీసుకోవడం మానేశారు. రూ.10 నోట్లస్థానంలో ఐదేళ్లక్రితం రూ.10 నాణేలను ఆర్బీఐ అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం రూ.10 నోట్ల కొరత వచ్చింది. ఇందుకు ప్రత్యామ్నాయమైన రూ.10 నాణెం చెలామణి అవుతుందని చెబుతున్నా కొంతమంది వ్యాపారులు తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. 2019లో ఆర్బీఐ ప్రవేశపెట్టిన రూ.10 నాణేన్ని స్టాండర్డ్ డిజైన్‌తో నాలుగు రకాలుగా విడుదల చేశారు. రూ.10 నోటు ఎక్కువకాలం మన్నికగా ఉండదు. దీంతో 20 ఏళ్లపాటు చెలామణిలో ఉండేలా ఆర్బీఐ నాణాన్ని అందుబాటులోకి తెచ్చింది. రూపాయి, రెండు, ఐదు రూపాయల నాణేల తరువాత రూ.10 నాణెం విలువైనది. తమిళనాడు, తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులు, వ్యాపార సముదాయాల్లోనూ విరివిగా వీటినే వినియో గిస్తున్నారు. ఇక్కడ ఈ నాణేని ఎందుకు తిరస్కరిస్తున్నారో అర్థం కాని పరిస్థితి.

తీసుకోకపోతే కేసు నమోదు

రూ.10 నాణెం చెలామణిలో ఉందని అన్నిచోట్ల చెల్లుబాటు అవుతుందని ఇటీవల ఆర్బీఐ స్పష్టం చేసింది. బ్యాంకర్లు తిరస్కరిస్తే ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. వాణిజ్య సముదాయాల్లో నాణాన్ని తీసుకోకపోతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. రూ.10 నాణెం చెలామణిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. ఏలూరులోని కొన్ని పెట్రోల్ బంకుల్లో కొందరు వాహనదారులు రూ.10 నాణేలు ఇవ్వగా సిబ్బంది తిరస్క రించారు. చిన్న వ్యాపారులు అవగాహన లేక నాణేలు తిరస్కరిస్తున్నారంటే వారిలో ఉన్న భయా లకు అర్థం ఉంది... కానీ కేంద్ర పెట్రోలియం సంస్థల ద్వారా నడిచే పెట్రోల్ బంకుల్లో సైతం తిరస్క రించడం విడ్డూరంగా ఉందని తగిన చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు కోరుతున్నారు.



వేలం కేంద్రం-2 లో కార్యాలయ సిబ్బందిని సత్కరించిన రైతులు

ముగిసిన పొగాకు అమ్మకాలు

రెండు వేలం కేంద్రాల్లో 30 మిలియన్ల విక్రయాలు
వేలం కేంద్రం-2లో ఎన్ఎల్ఎస్ టాప్ ధర రూ.411

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 26: జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రం-2లో కిలో పొగాకు ధర రూ.411 పలికి ఎన్ఎల్ఎస్ రీజియన్‌లో పొగాకు ధరల్లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు వేలం నిర్వహణాధికారి జె.సురేంద్రకుమార్ తెలిపారు. బుధవారం ఒకటవ వేలం కేంద్రం, గురువారంతో రెండో వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్ళు ముగిశాయి. మార్చి 6 న వేలం ప్రారంభమై 160 రోజుల పనిదినాల్లో వేలం కేంద్రం-1లో పదిహేను మిలియన్ల కిలోల పొగాకు అమ్మకాలు జరిగినట్లు వేలం కేంద్రం-1 వేలం నిర్వహణాధికారి శ్రీహరి తెలిపారు. తమ ప్లాట్‌ఫారంలో కిలో పొగాకుకు అధికంగా రూ.410 ధర పలికిందన్నారు. వేలం కేంద్రం-2 వేలం నిర్వహణాధికారి నరేంద్రకుమార్ మాట్లాడుతూ తమ వేలం కేంద్రం పరిధిలో 2023-24 సంవత్సర పంట కాలానికి 2803 మంది రైతులుండగా 3082 బ్యారన్లను రిజిస్టర్ చేసుకున్నారన్నారు. ఈ సంవత్సరం 15.15 మిలియన్ కిలోల పొగాకు అమ్మకాలు జరిగాయని తెలిపారు. కిలో పొగాకు ధర అత్యధిక ధర రూ.411, అత్యల్ప ధర రూ.100గా నమోదైనట్లు తెలిపారు. 52 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొన్నట్లు తెలిపారు. పొగాకు చూర (స్క్రాప్) అమ్మకాలను మరికొద్ది రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యాలయ సిబ్బందిని రైతులు ఘనంగా సత్కరించారు. రైతు సంఘ నాయకులు సత్రం వెంకట్రావు, చంటిబాబు, అట్లూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



టిప్పర్ యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఇసుక రవాణా వాహనాల రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

టిప్పర్ వాహన యజమానులతో కలెక్టర్ సమావేశం

భీమవరం టౌన్, సెప్టెంబరు 26 : ఇసుక రవాణాకు సంబంధించిన వాహనాల రిజిస్ట్రేషన్‌కు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి టిప్పర్ల యజమానుల సంఘాలకు తెలిపారు. కలెక్టరేట్‌లో టిప్పర్ల యజమానులతో సమావేశమై ఇసుక రవా ణాకు వాహనాల రిజిస్ట్రేషన్లపై సమీక్షించారు.ఉచిత ఇసుక విధానంలో భాగంగా ఇంటికి ఇసుక డోర్ డెలివరీ చేసే టిప్పర్ల యజమానులు డిపాజిట్ చెల్లించడం, అఫిడవిట్ రూపంలో ఒప్పందం చేసుకోవడం వంటివి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిందన్నారు. నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేయాలని, టిప్పర్లకు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వినియోగదారులకు ఇబ్బంది లేనివిధంగా ఇసుక రవాణా వెంటనే చేపట్టాలని టిప్పర్ల యజమానులను కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్‌వో జె.ఉదయ భాస్కరరావు,ఆర్డీవో పి.ఉమా మహేశ్వర రావు, జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి జయప్రసాద్, టిప్పర్ల యజమానుల సంఘాలకు చెందిన రావూరి రాజా, బండారు సత్తిబాబు, కౌరు నాగరాజు, కోలా సత్యనారాయణ, బండారు శ్రీనివాస్, యాతం గణపతి, ముచ్చర్ల వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు ఏక మొత్తంలో చెల్లించాలి

రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు

భీమవరం టౌన్, సెప్టెంబరు 26 : గత పీఆర్సీ , డీఏ బకాయిలు, అన్ని రకాల పెండింగ్ బకాయిలను రిటైరైన వారికి ఏకమొత్తంగా ఒకేసారి చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జేమ్స్ ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం భీమవరం రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించారు. కొత్త పీఆర్సీ కమిటీని నియమించి ఇంటెరిం రిలీఫ్ (ఐఆర్) ప్రకటించాలని, అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పాత రేట్లలో అమలు చేయాలని, కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్ మినహాయింపు 11 సంవత్సరాలకే పరిమితం చేయాలన్నారు. ఫ్యామిలీ పెన్షనర్స్ పుట్టిన తేదీలేని వారికి నమోదు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగిరాజు నారాయణరాజు, కోశాధికారి రవిప్రసాద్ ప్రవేశపెట్టిన నివేదికలను కార్యవర్గం ఆమోదించింది. సమావేశంలో స్టేట్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ బాబ్జి పెన్షనర్స్‌కు అన్ని రకాల సేవలను తమ బ్యాంకులో సేవా భావంతో చేస్తామన్నారు.బ్యాంకు మేనేజర్ బాబ్జిని, ఉండి మండలం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ గాదిరాజు రంగరాజుని సమావేశంలో సన్మానించారు. సమావేశంలో సహాధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్‌రాజు, జోబ్బాబు, ఎస్.ఎస్ పాల్, సూర్యనారాయణ, కె.చంద్రరావు, వీఎస్ అప్పారావు, యూజీసీ లెక్చరర్స్ సాగి అప్పలరాజు పాండురంగ రాజు తదితరులు పాల్గొన్నారు. భీమవరం, ఆకివీడు, గణపవరం, పాలకొల్లు మండల యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.



రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రంగరాజును సత్కరించిన దృశ్యం



దువ్వ మూల లంక వంతెన వద్ద గుమిగూడిన జనం

వయ్యేరులోకి దూకిన బాలిక ?

గాలింపు చర్యలు చేపట్టిన పోలీసు, అగ్నిమాపక సిబ్బంది

తణుకు, సెప్టెంబరు 26 : వయ్యేరు కాలువలోకి బాలిక దూకినట్లు అనుమానంతో వంతెన వద్దకు పెద్ద ఎత్తున ప్రజలు చేరుకున్నారు. శుక్రవారం కోనాల గ్రామానికి చెందిన బాలిక ముద్దాపురంలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. రోజు మాదిరిగానే ఉదయం స్కూలుకు ఇంటి నుంచి వెళ్లింది. స్కూలుకు వెళ్ళిన బాలిక తిరిగి వచ్చి దువ్వ మూల లంక వంతెన నుంచి వయ్యేరు కాలువలోకి దూకినట్లు అనుమానిస్తున్నారు. అయితే వంతెన వద్ద బాలిక విడిచిన చెప్పులు, వాటర్ పైపుపై బాలిక పాద ముద్రలు ఉండటంతో వయ్యేరులో దూకినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మూర్తి తెలిపారు. బాలిక కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వయ్యేరులో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఎలాంటి ఆచూకీ తెలియ రాలేదు. కోనాల, ముద్దాపురం, దువ్వ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున కాలువ వద్దకు తరలి వచ్చారు.

యనమదుర్రు డ్రెయిన్‌లో వ్యక్తి గల్లంతు

భీమవరం క్రైం, సెప్టెంబరు 26 : భీమవరం పట్టణంలోని గొల్లవానితిప్ప రోడ్‌లో ఉన్న యనమదుర్రు డ్రెయిన్‌పై ఉన్న వంతెన నుంచి దూకి ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. టూటౌన్ ఎస్ఐ రహమాన్ తెలిపిన ప్రకారం ఎన్టీఆర్ జిల్లా ప్రాంతానికి చెందిన పోతినీడి నాగరాజు కొంతకాలం క్రితం కుటుం

క్రైమ్ కార్నర్

బంతో సహా భీమవరం సగర్లపేటలో నివాసం ఉంటున్నాడు. అయితే ఈనెల 25వ తేదీ సాయంత్రం 4 గంటలకు బయటకు వెళుతున్నానని భార్యతో చెప్పి వెళ్లాడు. సాయంత్రం 6 గంటల సమయంలో భార్యకు ఫోన్ చేసి డ్రెయిన్‌లో దూకి చనిపోతున్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. భార్య, బంధువులు వెతకగా గొల్లవానితిప్ప రోడ్‌లో ఉన్న వంతెనపై ద్విచక్ర వాహనం, చెప్పులు, ఫోన్ కనిపించడంతో భార్య పోలీస్‌లకు పిర్యాదు చేసింది. డ్రెయిన్‌లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 26 : గోదావరిలో గల్లంతైన వ్యక్తి భీమవరానికి చెందిన నాయుడు సుబ్రహ్మణ్యం(33)గా కొవ్వూరు రూరల్ పోలీసులు గుర్తించారు. ఈనెల 24వ తేదీన కొవ్వూరు, రాజమహేంద్రవరం మధ్య గోదావరిపై ఉన్న రోడ్డు కం రైలు బ్రిడ్జిపై బైక్‌ను పార్క్‌చేసి ఒక వ్యక్తి గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. మృతదేహం బుధవారం అర్ధరాత్రి కొవ్వూరు మండలం మద్దూరులంక బ్యారేజ్ గేట్ల వద్ద గుర్తించారు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుబ్రహ్మణ్యం ఈనెల 24వ తేదీన ఏడిద గ్రామంలో ఉన్న తల్లిదండ్రులను చూడడానికి వెళ్లి తిరిగి భీమవరం బయలుదేరాడు. బ్రిడ్జిపైకి వచ్చే సరికి ఫిట్స్ రావడంతో గోదావరిలో పడిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

చింతలపూడి, సెప్టెంబరు 26 :చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలోని చెరువులోకి దిగి గ్రామానికి చెందిన ఏలూరు నాగరాజు (26) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. గురువారం స్థానికులు కనుగొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వెలికితీశారు. ఎస్ఐ కుటుంబరావు మాట్లాడుతూ మృతుడు తాపీ పనులు చేస్తుంటాడని, రెండు రోజుల క్రితం బయటకు వెళ్లాడని తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు రెండు రోజుల నుంచి గాలిస్తున్నా కనపడలేదు. గురువారం చెరువులో శవమై కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నిద్రమత్తులో కారు బీభత్సం..యువకుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 26: డ్రైవర్ నిద్రమత్తుతో కారు పాదచారులపై దూసుకెళ్లడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన తాడేపల్లిగూడెంలో బుధవారం అర్ధరాత్రి కలకలం రేపింది. నిడమర్రు మండలం భువనపల్లికి చెందిన వినయ్‌బాబు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వినయ్‌బాబు తన స్నేహితుడిని కారులో రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో దింపి తిరిగి ఇంటికి వస్తూ నిద్రమత్తులో తాడేపల్లిగూడెంలో రేలంగి చిత్ర మందిర్‌వైపు నడిచి వెళ్తున్న ముగ్గురు యువకులను ఢీకొట్టాడు.. దీంతో పట్టణానికి చెందిన కరణం దుర్గారావు (30) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు యడ్ల నాగేశ్వరరావు,మజ్జి దుర్గాప్రసాద్‌లకు తీవ్ర గాయాలవడంతో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యడ్ల నాగేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమండ్రి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ వినయ్‌బాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.





విధ్వంసం సృష్టించిన కారు ప్రమాదంలో మృతి చెందిన దుర్గారావు (ఫైల్‌ఫోటో)



శిరస్సుపై అఖండ దీపంతో పాదయాత్రగా ద్వారకాతిరుమలకు వస్తున్న అవినాష్ దేవిచంద్ర తదితరులు

అపరాధం మన్నించు స్వామీ..

లడ్డూ కల్తీపై అఖండ దీపంతో మహా పాదయాత్ర

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 26: తిరుపతి కల్తీ ప్రసాదం దోషులను శిక్షించాలని కోరుతూ పిఠాపురం నుంచి పెద్ద తిరుపతి వరకూ తారా వారాహి లోక కల్యాణార్థ సేవా భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా పాదయాత్ర గురువారం మధ్యాహ్నం ద్వారకాతిరుమల చేరుకుంది. అఖండ దీపాన్ని తలపై ఉంచుకుని ట్రస్టుచైర్మన్ అవినాష్ దేవిచంద్ర పాదయాత్ర చేసుకుంటూ క్షేత్రానికి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దేవిచంద్ర మాట్లాడుతూ ఇటీవల తిరుమల ప్రసాదం కల్తీ విషయంలో మహాపాపం జరిగిందని ఆ పాపం పోవాలంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ ఒక్కరూ అఖండ దీపం వెలిగించాలని కోరారు.

మోకాళ్లతో శ్రీవారి ఆలయ మెట్లు ఎక్కిన జన సైనికులు



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 26: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన నాయ కులు, వీర మహిళలు ద్వారకా తిరుమల ఆలయ దక్షిణగోపురం ముందున్న మెట్లను మోకాళ్లపై ఎక్కారు. పాదుకా మండపం వద్ద 108 కొబ్బరి కాయలను కొట్టారు. తిరుపతి లడ్డూ కల్తీ ఘటనపై ఏలూరు జనసేన పార్టీ, నగర కమిటీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం తలపెట్టినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, నగర అధ్యక్షుడు కాశీ నరేష్, బీజేపీ, టీడీపీ నాయకులు కుసుమ కుమారి, ఇమ్మడి రత్నాజీ, కావూరి వాణిశ్రీ, రవి, గాయత్రి, పద్మ, కోట అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.





అలంకరణలో స్వామివారు.. హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కాళ్ళకూరు వెంకన్న ఆలయంలో పవిత్రోత్సవాలు

కాళ్ళ, సెప్టెంబరు 26 : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్త నదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం స్వామివారికి యాగశాలార్చన, అగ్ని ప్రతిష్ఠ, కుంభ వాహన, పవిత్ర ప్రతిష్ఠ , పవిత్రాధివాసం, ప్రాయశ్చిత హోమాలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు పవిత్ర సమర్పణ తీర్థగోష్ఠి, ప్రసాద వితరణ ఘనంగా జరిపారు. ఈవో అరుణ్‌కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు. కొండూరి వెంకట రమణాచార్యులు బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, కరాటం రాంబాబు

పోలవరం బాధితుల సమస్యలు పరిష్కరించండి

కొయ్యలగూడెం, సెప్టెంబరు 26: పోలవరం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ సమస్య పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరినట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబుతో కలిసి ఆయన గురువారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిశారు. పోలవరం నియోజకవర్గ సమస్యలను ఆయనకు వివరించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో రైతులు, నిర్వాసితులకు ఇచ్చిన భూములకు ఇంకా పరిహారం అందలేదన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ సమస్యలన్నీ త్వరలోనే పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. గ్రామీణ రోడ్లు, పర్యాటక రంగం అభివృద్ధి చేయాలని కోరామన్నారు. జనసేన నాయకులు కరాటం సాయిబాబు, గడ్డమనుగు రవికుమార్ ఉన్నారు.

ఓఎల్ఎక్స్‌లో కారు బేరం..

అమ్మేసిన కారునే విక్రయించి రూ.3 లక్షలకు టోకరా

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 26: తాడేపల్లిగూడెంలో ఓఎల్ఎక్స్‌లో కారు బేరం పెట్టి మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఓ అమ్మేసిన కారును అమ్మకానికి పెట్టి మరొకరికి విక్రయించి రూ.3 లక్షలు మోగించాడో ప్రబుద్ధుడు. దీనికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడేనికి చెందిన వ్యక్తి ఓఎల్ఎక్స్‌లో ఓ కారును అమ్మకానికి పెట్టాడు. మండపేటకు చెందినవారు తాడేపల్లిగూడెం వచ్చి కారు చూసుకున్నారు. రెండు రోజుల్లో వస్తామని చెప్పి కొనుగోలు చేసేందుకు డబ్బుతో వచ్చారు. కారు స్నేహితుడు తీసుకెళ్లాడని గంటలో వస్తుందని చెప్పి కారు బేరం పెట్టాడు. రూ.4 లక్షలకు మాట్లాడుకున్న మండపేట వాసి దానికి సంబంధించి అడ్వాన్స్ ఇద్దామని అనుకున్నాడు. కారు వచ్చేస్తుంది.. డబ్బులు ఇచ్చేయండని పట్టుబట్టడంతో రూ.3 లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లించారు. మిగిలిన లక్ష రూపాయలు కారు కాగితాల బదిలీ సమయంలో ఇస్తామని చెప్పారు. ఎంత సేపటికీ కారు రాలేదు. కారు విజయవాడ తీసుకెళ్లారని రేపు ఉదయమే వచ్చి తీసుకెళ్లండని నమ్మించి పంపించాడు. మరుసటి రోజు కూడా అలాగే కారు రావకపోవడంపై స్టోరీ చెప్తుండటంతో అనుమానం వచ్చిన మండపేట వాసి కారు ఎవరి పేరున ఉందో చెక్ చేయగా నర్సీపట్నం పేరు మీద తాను కొనుగోలు చేద్దామనుకున్న రోజుకంటే ముందే విక్రయించినట్టు తెలిసి మోసపోయినట్టు గుర్తించాడు. వెంటనే తాడేపల్లిగూడెం పోలీసులను ఆశ్రయించగా అక్కడ ఇరువురినీ పిలిపించి డబ్బులు ఇచ్చేందుకు అంగీకార పత్రం రాయించి పంపించేశారు. డబ్బులు ఇస్తానన్న గడువు దాటినా ఇవ్వకపోవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి..13 మంది అరెస్టు

పెనుగొండ, సెప్టెంబరు 26 : పేకాట స్థావరంపై దాడి చేసిన 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. బుధవారం రాత్రి రెండు గంటల సమయంలో పెనుగొండలోని ఒక లాడ్జిలో పేకాట ఆడుతున్న వ్యక్తులపై దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 40, 300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోటారు సైకిల్ చోరీపై కేసు నమోదు

అత్తిలి, సెప్టెంబరు 26 : మోటారు సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్‌పి ప్రేమ్‌రాజ్ తెఎలిపారు. కంచుమర్రు గ్రామంలోని రొయ్యల చెరువు మీద ఈడూరు గ్రామానికి చెందిన నంద్యాల రాంబాబు పని చేస్తున్నాడు. ఈనెల 17వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో చెరువు పక్కన మోటారు సైకిల్‌ను పెట్టి చెరువు మీద కాపలాకు వెళ్ళి తిరిగి తెల్లవారు జామున 3 గంటలకు వచ్చే చూసేసరికి మోటారు సైకిల్ కనిపించలేదు. బాధితుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాగునీరు వృథా



మదనగోపాలస్వామి దేవస్థానంలో వీధిలో వృథాగా పోతున్న తాగునీరు

ఆకివీడు, సెప్టెంబరు 26 : తాగునీరు వృథా అవుతున్నది. నగర పంచాయతీ పరిధిలోని ఇరవై వార్డుల్లో పబ్లిక్ ప్రాంతాల్లో మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. వాటిలో కొన్నిచోట్ల బిరడాలు లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతున్నది. గతంలో ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు లేకపోవడంతో సంబంధిత అధికారులు వీధుల్లో పబ్లిక్ ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. నేడు ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు ఉండడంతో పబ్లిక్ కుళాయిలు వినియోగం తగ్గింది. అంతే కాకుండా పబ్లిక్ కుళాయిలకు బిరడాలు లేకపోవడంతో తాగునీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

నేడు ఏపీఐఐసీ చైర్మన్ రాక

ఆకివీడు, సెప్టెంబరు 26 : ఏపీఐఐసీ చైర్మన్‌గా మంతెన రామరాజు బాధ్యతలు చేపట్టి శుక్రవారం జిల్లాకు వస్తున్న సందర్భంగా ఉప్పుటేరు దగ్గర కూటమి శ్రేణులు ఘనస్వాగతం పలుకుతున్నామని టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్ తెలిపారు. ఉప్పుటేరు నుంచి అయి-భీమవరం, చెరుకుమిల్లి, జువ్వలపాలెం మీదుగా కాళ్ళకూరులో వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని భీమవరంలోని తన క్యాంపు కార్యాలయానికి వెళతారన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలి

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 26: విద్యార్థినీలు, మహిళలలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నరసాపురం డీఎస్పీ ఎస్‌ఎంబీ మురళీ కృష్ణ అన్నారు. ఏఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజ రాజేశ్వరి అధ్యక్షత వహించారు. డీఎస్పీ మురళీ కృష్ణ మాట్లాడుతూ పోక్సో చట్టం, ర్యాగింగ్ చట్టం, 112, 100, 109, 1098 హెల్ప్‌లైన్ నెంబర్లు, వాటి ప్రయోజనాలపై వివరించారు. ప్రేమ వివాహాలు, బాల్య వివాహాలు, ర్యాగింగ్, వంటి అంశాలను సీఐ కె.రజనీకుమార్ వివరించారు. ఏఎస్ఐ మార్లింగం తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం కల్తీ చేయడం దారుణం

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 26: మన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడవలసిన బాధ్యత ప్రతి హిందువుపైనా ఉందని తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, అన్నారు. తిరుపతిలోని శ్రీవారి ప్రసాదం కల్తీ విషయంపై రోజా రమణి, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరు నాయుడు దంపతులు విలేకర్లతో మాట్లాడారు. రోజారమణి మాట్లాడుతూ తాము స్వామివారిని దర్శించుకుని వచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం స్వామివారి లడ్డు ప్రసాదం పూర్వ పద్ధతిలోనే మంచి నెయ్యి వాసనతో ఉందని వారు తెలిపారు. ఇప్పటి వరకు ఆలయంలో ఆచారాలను, సాంప్రదాయాలను తుంగలో తొక్కారని వారు ఆరోపించారు. లడ్డు ప్రసాదం తయారీలో వినియోగించిన ఆవు నెయ్యిలో కల్తి జరగడం దారుణమని వారు అన్నారు.

- స్థానిక రంగమన్నారుపేటలో వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు బిహెచ్ వెంకటేశ్ వడయార్ వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి మాట్లాడుతూ హిందఉవుల మనోభావాలు దెబ్బతీసిన జగన్, ఆపార్టీ నేతలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే రఘురామపై కేసు నమోదు చేయాలి

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 26: కాళ్ళ మండలం ఏలూరు పాడులో జరిగిన సంఘటనపై ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. మాలమహానాడు ఆధ్వర్యంలో పట్టణంలోని కెనాల్ రోడ్డులో ధర్నా చేశారు. ముందుగా నాయకులు డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నల్లి రాజేష్ మాట్లాడుతూ ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి వేసిన సంఘటనపై వారం రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి

పెనుగొండ, సెప్టెంబరు 26: గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల స్థలంలో ఇంటి నిర్మాణం ప్రారంభించి పూర్తి చేయని లబ్ధిదారులను పోత్సహించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ సీఎస్‌వీ రెడ్డి అన్నారు. వడలి గ్రామంలో మన ఇల్లు- మన గౌరవం సమావేశాన్ని అధికారులతో నిర్వహించారు.

విరాళాలు అందజేత

భీమవరంటౌన్, సెప్టెంబరు 26: వరద బాధితుల కోసం విరాళాల పరంపర కొనసాగుతున్నది. గురువారం కూడా అనేక మంది జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుకు విరాళాలు అందించారు. పశుసంవర్ధక శాఖ, సాయి ఇంజనీరింగ్ వర్క్స్, యలమంచిలి మండలం కట్టుపాలెం ఉపాధ్యాయులు, విద్యార్థులు, శృంగవృక్షం పాఠశాల, ఎఆర్‌కెఆర్ మునిసిపల్ ఉన్న త పాఠశాల విద్యార్థులు, భీమవరం ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్, కాళ్ల సచివాలయ సిబ్బంది తదితరులు విరాళాలు అందించారు.

సంక్షిప్త సమాచారం..

- **తణుకు:** ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ఎస్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులు గురువారం ఎన్టీఆర్ పార్కు వద్ద స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను, పరిసరాలను శుభ్రం చేశారు.
- **పెనుగొండ:** గణపతి నవరాత్రులలో భాగంగా చెరుకువాడ కటకటాల రామాలయం వద్ద గణేషుని దర్శించుకున్న ఎమ్మెల్యే తనయుడు పితాని గిరిధర్ గోపాలకృష్ణతో పాటు జవ్వాది లక్ష్మయ్య నాయుడు , నక్కా వేద వ్యాస శాస్త్రిలను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.
- వడలిలో అంగన్‌వాడీ, పంచాయతీ కార్యాలయం, ఆరోగ్య కేంద్రాల్లో శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈవో రామకృష్ణ, ఉపసర్పంచ్ వలపన నరేష్, ఉప్పలపాటి చంటి పాల్గొన్నారు.
- **భీమవరం ఎడ్యుకేషన్:** ఫిల్టర్ చేసి స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించాలని సీపీఎం మాజీ మండల కార్యదర్శి రేవు రామకృష్ణ డిమాండ్ చేశారు. గూట్లపాడు గ్రామంలో ఆందోళన చేసి వినతిపత్రాన్ని సచివాలయ గ్రామ కార్యదర్శి సత్యనారాయణకి అందించారు.
- ఇటీవల గొల్లవానితిప్ప గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ జనసేన మాజీ అధ్యక్షులు, ప్రస్తుత గౌరవ అధ్యక్షుడు కొట్టు రాంబాబు నివాసానికి ఎమ్మెల్యే రామాంజనేయులు విచ్చేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.
- **గణపవరం:** ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, భారతదేశం అనే అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ డిగ్రీ కాలేజీ ఆర్థిక శాస్త్ర ఉపన్యాసం డాక్టర్ అరవింద స్వామి పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలకుమారి పాల్గొన్నారు.
- డిగ్రీ కాలేజీలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మానవ హారం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం యూనిట్ అధికారి డాక్టర్ జీ.వెంకటరమణ మాట్లాడుతూ అక్టోబర్ 2లోగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తప్పనిసరిగా 3 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించాలని కోరారు.
- **ఉండి:** ఇండియా ఇంటర్నేషనల్ ఆక్వా కల్చర్ ఎక్స్‌పో 2024 ఎగ్జిబిషన్ శుక్రవారం ఉదయం 10గంటలకు కోట్ల ఫంక్షన్‌హాలులో జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది.
- మండలంలోని అన్ని గ్రామాల్లో ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. నారుమడిన వేసిన దగ్గర నుంచి కోత కోసేవరకు అనేక దశలలో ఎలుకల నష్టాన్ని కలుగజేస్తున్నాయని మండల వ్యవసాయాధికారి సంధ్య తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు కునుకు రమాదేవి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- సీబీసీఎన్‌సీ రిటైర్డు ఉపాధ్యాయుడు పాల్ ప్రభాకర్ గురువారం మృతి చెందారు. ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆకివీడు ఉండి శాఖ అధ్యక్షకార్యదర్శులు జోబ్‌బాబు, గాంధీబాబురాజు, ఫణిప్రసాద్, రంగరాజు తదితరులు సంతాపం తెలిపారు.
- **ఆకివీడు రూరల్:** కళింగగూడెంలో ఎలుకల నివారణ మందును రైతులకు అందజేశారు. సామూహికంగా రైతులందరూ ఒకేసారి చెయ్యడం వలన రైతులకు మేలుజరిగి, సస్యరక్షణ జరుగుతుందని అధికారులు తెలిపారు.
- **మొగల్తూరు:**ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయ ఈవోగా కాళ్ళకూరు వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి బదిలీపై వచ్చిన మోకా అరుణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈవోగా పని చేసిన డి.రామకృష్ణంరాజు నుంచి ఆయన చార్జి తీసుకున్నారు.






భీమవరంలో కరపత్రాలు చూపుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు, సీతారామలక్ష్మి, రామన్నగూడెంలో పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి, వలవల, కోమటితిప్పలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నాయకర్, పెదఅమిరంలో ఎమ్మెల్యే రఘురామకు చెక్కు అందిస్తున్న సర్పంచ్ సోమేశ్వరరావు

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఇది మంచి ప్రభుత్వం ముగింపు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 26: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గునుపూడిలో గురువారం కూటమి ప్రభుత్వం వంద రోజుల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే అంజిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తే అందరూ ఆరోగ్యవంతమైన జీవితం సాగించవచ్చునని అన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనతో రాష్ట్ర ప్రజలకు ఎంతో దగ్గరైందని అన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కె రామచంద్ర రెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారధి, రాష్ట్ర నాయకులు కోళ్ళ నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, ఎఎంసి మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 26: నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. రామన్నగూడెంలో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో రూ.65 లక్షలతో రోడ్ల నిర్మాణానికి, జలజీవన్ మిషన్ ద్వారా రూ.20 లక్షలతో పైపులైన్ల ఏర్పాటు పనులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జితో కలిసి శంకుస్థాపన చేశారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, సర్పంచ్ చింతా వెంకట్రావు, గ్రామాధ్యక్షుడు మద్దిపాటి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

'సంక్షోభంలోను సంక్షేమం అందిస్తున్నాం'

కాళ్ళ, సెప్టెంబరు 26: సంక్షోభంలో కూడా సంక్షేమాన్ని తమ ప్రభుత్వం అందిస్తున్నదని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం ముగింపు కార్యక్రమం పెదఅమిరం గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 భాగంగా ప్రతి ఒక్కరూ తమ సలహాలు, మంచి సూచనలు అందించే విధంగా ఒక పోర్టల్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ అభినందనీయమన్నారు. ఇందులో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈసందర్భంగా పెదఅమిరం గ్రామం తరుపున ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.2లక్షలు చెక్కును సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో బీజేపీ ఉండి ఇన్‌చార్జి కోరా రామ్మూర్తి, సర్పంచ్ డొక్కు సోమేశ్వర రావు పాల్గొన్నారు.

పెనుమంట్ర: గతంలో ప్రభుత్వంపై గళమెత్తితే అరెస్టులు చేసే వారని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం మార్టేరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజా వేదిక నిర్వహించారు. ఐదేళ్లలో ఒకటో తారీఖున ఉద్యోగులకు జీతాలు ఇచ్చిన పరిస్థితి లేదని కూటమి ప్రభుత్వం రాగానే ఒకటో తారీఖున ఉద్యోగుల జీతాలు చెల్లించిన ఘనత చంద్రబాబు పవన్ కళ్యాణ్‌కే దక్కుతున్నాను. తొలుత గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం శిబిరాన్ని ఎమ్మెల్యే పితాని సత్యనా రాయణ తిలకించారు

మొగల్తూరు: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. గురువారం కోమటితిప్ప గ్రామంలో ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి సర్పంచ్ పులపర్తి సూర్యనారాయణ (ఏసులు) అధ్యక్షత వహించారు.



రేలంగి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

వంద రోజుల్లోనే ప్రజలకు సుపరిపాలన

ఇరగవరం, సెప్టెంబరు 26 : రాష్ట్రం రూ.పది లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నా అధికారం లోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు సుపరిపాలన అందించామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. రేలంగిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. పవిత్రమైన తిరుపతి లడ్డూలో వాడే ఆవు నెయ్యిని కూడా కల్తీ చేసిన వ్యక్తి వైఎస్ జగన్ అని మండిపడ్డారు.

విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేత

ఆచంట, సెప్టెంబరు 26: ఆచంట గవర్నమెంటు ఐటీఐలో గత ఆగస్టు నెలలో జరిగిన పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్థానిక ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్‌లు అందజేశారు. అలాగే 2024-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్తగా జాయిన్ అయిన విద్యార్థుల కోసం ఫ్రెషర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు అధ్యక్షత వహించారు.

పట్టుదల, హార్డ్‌వర్క్ ఉండాలి

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 : పట్టుదల, హార్డ్‌వర్క్, స్కిల్స్ ఉంటే ఏ ప్రముఖ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో చదివినా ఉన్నత స్థానానికి వెళ్ళవచ్చని సివిల్ ఇంజనీరింగ్ చదివి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్న ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థిని ఎన్.సత్యసుందరి అన్నారు. గురువారం కళాశాలలో గూగుల్ డెవలపర్ గ్రూప్స్ బృందం ఆధ్వర్యంలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి గూగుల్ డెవలపర్ ఫ్యాకల్టీ అనన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్య సుందరి మాట్లాడుతూ భరతనాట్యంలో గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డు సాధించినట్లు చెప్పారు. కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 : యువత రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.కమల్ పిలుపునిచ్చారు. గురువారం కళాశాలలో ఏఎస్‌ఎన్ రాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాకు అధిక ప్రాధాన్యం

తణుకు, సెప్టెంబరు26 : ఆర్టీసీ ద్వారా ప్రజా రవాణాకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో నూతన స్టార్ లైనర్ సర్వీసును గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మొక్క నాటారు. వివిధ యూనియన్ నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. డిపో మేనేజర్ ఎస్.గిరిధర్‌కుమార్, కూటమి శ్రేణులు కలగర వెంకటకృష్ణ, బసవా రామకృష్ణ, చినిమిల్లి ప్రసాదు, సప్పారాజు, మునగాల శ్రీనివాసు, చీర్ల శ్రీనివాసు, కొమ్మిరెడ్డి శ్రీనివాసు, ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

117 జీవో రద్దు చేయాలి

తణుకు, సెప్టెంబరు 26 : వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను రక్షించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ కోరారు. వేల్పూరు, కొమవరం, మండపాక, పైడిపర్రు, గ్రామాల్లోని పాఠశాలలను గురువారం సందర్శించారు. గత ఉత్తర్వులు వల్ల ప్రాధమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాల్లో విలీనం చేయడం వల్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం వల్ల ఏకోపాధ్యాయ పాఠశాలలుగా విచ్ఛిన్నమై పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుమంట్ర, సెప్టెంబరు 26: పెనుమంట్ర మండల పరిధిలో అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ బి.సురేష్ కుమార్ తెలిపారు. పెనుగొండలో సబ్ స్టేషన్ మెయింటినెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుదన్నారు.

30న జాబ్ మేళా

తణుకు, సెప్టెంబరు 26 : చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 30న తణుకు స్కిల్ డెవలెప్‌మెంట్ హబ్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021-24 మధ్య ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ ఉతీర్ణులైన వారు అర్హులన్నారు. వివరాలకు 96185 60188లో సంప్రదించాలన్నారు.

దర్భరేవు ఇంజనీరింగ్ అసిస్టెంట్ సస్పెన్షన్

నరసాపురం రూరల్, సెప్టెంబరు 27: దర్భరేవు సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న లీలాకృష్ణను సస్పెండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పీఎం ఆవాస్ యోజన పథకంలో నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేయించారంటూ గ్రామస్థులు ఇటీవల జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ నాగరాణి విచారణకు ఆదేశించారు. ప్రాథమిక విచారణలో ఆరుగురు లబ్ధిదారుల గృహాలకు రుణాలు మంజూరైనట్లు తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేశారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

భీమవరంటౌన్, సెప్టెంబరు 26 : భీమవరంలోని ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయంలో శుక్రవారం నాడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారవేదిక నిర్వహిస్తున్నారని ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి



విద్యార్థులతో ఎమ్మెల్యే పత్సమట్ల, ఉపాధ్యాయులు

గణపవరం, సెప్టెంబరు 26: బావిభారత పౌరులుగా విద్యార్థులను తరగతి గదుల్లో తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. గురువారం పిప్పరలో గురుపూజోత్సవం నిర్వహించారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కోలాట నృత్యాలు నిర్వహించారు.

పంట నష్టపరిహారం విడుదల

నరసాపురం రూరల్, సెప్టెంబరు 26: ఇటీవల వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.1.20కోట్లు విడుదల చేసినట్లు ఏవో డాక్టర్ జాన్సన్ తెలిపారు. మండలంలో మొత్తం 1270 ఎకరాల్లో 1090 మంది రైతులు సాగు చేశారన్నారు. వీరందరూ పంట కోల్పోవడంతో ప్రభుత్వం ఎకరాకు రూ 10వేలు చొప్పున పరిహారం అందించిందన్నారు.

మంచి ప్రభుత్వం కరపత్రాలు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని 27వేల కుటుంబాలకు ప్రభుత్వం అందించిన మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర 2047లకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నట్లు ఈవోపీఆర్డీ శర్మ తెలిపారు. ఇప్పటికే 15వేల కరపత్రాలు మండల కార్యాలయానికి వచ్చాయన్నారు. వీటిని సచివాలయల వారీగా సిబ్బందికి అందిస్తున్నామన్నారు. వీరు ఇంటింటికి వెళ్లి 100రోజుల పాలనపై ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరిస్తారన్నారు.

ఆర్‌అండ్‌బీ ఏఈగా ప్రసన్నబాబు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 26: ఆర్‌అండ్‌బి ఏఈగా ప్రసన్నబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయవాడ ఆర్‌అండ్‌బీ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ ఏఈగా పని చేస్తున్న నిక్కిరాజ్ ఆరునెలల క్రితం రాజమండ్రి ఆర్‌అండ్‌బీ డివిజన్‌కు బదిలీ అయ్యారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

నరసాపురం టౌన్, సెప్టెంబరు 26: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడు పారిశుధ్య సమస్య తలెత్తదని కమిషనర్ అంజయ్య అన్నారు. గురువారం పట్టణంలోని ఫిష్ మార్కెట్‌ను సందర్శించారు. దుకాణాల వివరాలు, శానిటేషన్ తదితర అంశాలపై ఆరా తీశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. లేని పక్షంలో దోమలు సోకి వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందన్నారు. ఇటు శానిటరీ సిబ్బంది చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ కొప్పాడ రవి, మాజీ వీసీ అనంతరామారావు, కౌన్సిలర్ పాలూరి బాబ్జీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, కిషోర్ పాల్గొన్నారు.


రోడ్ల మరమ్మతులకు రూ.2.18కోట్లు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 26: నరసాపురం నియోజకవర్గంలో రహదారుల మరమ్మతుల నిమిత్తం రూ.2.18 కోట్ల ఆర్‌అండ్‌బి నిధులు మంజూరైనట్లు ఆశాఖ డీఈ జీవీఎస్ కిరణ్ తెలిపారు. ప్రస్తుతం ఏఏ గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వానంగా ఉన్నాయన్న దానిపై గుర్తిస్తున్నామన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తవ్వగానే దశలవారీగా రహదారి మరమ్మతుల పనులు చేపడతామని డీఈ తెలిపారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

కాళ్ళ, సెప్టెంబరు 26 : కోపల్లె గ్రామం వనరుల కేంద్రం వరిలో యాజమాన్య పద్ధతులు మీద అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో జి.బాలనాగేశ్వరమ్మ మాట్లాడుతూ రైతులు ముఖ్యంగా మేలైన యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అందులో భాగంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని తెలిపారు. అదేవిధంగా బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు గమనించినట్లయితే పొలంలో ఉన్నటువంటి నీరును బయటకు తీసి 15 నుంచి 20 కేజీల పోటాష్ వేసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ మేలైన అధిక దిగుబడి నిచ్చే వరి వంగడాలను రైతులు సాగు చేయాలని అన్నారు.

కాళ్ళ తహసీల్దార్‌గా సుందర్‌సింగ్



కాళ్ళ, సెప్టెంబరు 26 : కాళ్ళ మండలం తహసీల్దార్‌గా జి.సుందర్‌సింగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికలలో భాగంగా బదిలీపై కాళ్ళ మండలం వచ్చి తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీదేవి కోనసీమ జిల్లాకు బదిలీపై వెళ్ళారు. ఏలూరు జిల్లాలో పని చేసిన సుందర్‌సింగ్ బదిలీపై కాళ్ళ మండలానికి వచ్చారు.

కాశిపాడులో పొలం పిలుస్తోంది

గణపవరం, సెప్టెంబరు 26: ఆధునిక వ్యవసాయం లాభసాటిగా ఉండే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తాడేపల్లిగూడెం ఏడీఏ మురళీకృష్ణ అన్నారు. గురువారం కాశిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గణపవరం మండల వ్యవసాయాధికారి ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లోని ధాన్యం కొనుగోలులో రైతు తనకు నచ్చిన మిల్లుకు ధాన్యం తోలుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు.

ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ

గణపవరం, సెప్టెంబరు 26: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని తహసీల్దార్ అప్పారావు తెలిపారు. గురువారం గణపవరం ఎంపీడీవో కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. కామన్ ధాన్యం క్వింటాకు రూ.2300, గ్రేడ్-ఏ ధాన్యం రకం రూ.2320 మద్దతుగా నిర్ణయించారని తహసీల్దార్ తెలిపారు.

హిందూ శ్మశాన వాటిక పరిశీలన

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు, 26:పాలకొల్లు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను గురువారం రాత్రి రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ శ్మశానవాటికను అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ బి.విజయసారధి, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన

అత్తిలి, సెప్టెంబరు 26 : మండలంలోని 20 రైతు సేవా కేంద్రాలలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 69 కేజీల ఎలుకల మందును నూకలలో కలిపి రైతులకు అందజేశారు. ఈ విషపు ఎరను 10 గ్రాముల చొప్పున గుర్తించిన ఎలుక బొరియలలో ఉంచాలని రైతులందరూ ఒకేసారి సామూహికంగా ఎలుకల నిర్మూలన చేసినట్లయితే ఫలితం ఉంటుందని వ్యవసాయాధికారి టీకే రాజేష్ తెలిపారు.

3 నుంచి దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 26: అక్టోబరు 3వ తేదీ నుంచి యడ్ల బజారులోని శ్రీకనక దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొలి రోజున వాసవీ కన్యకా పరమేశ్వరిగా అమ్మవారు దర్శనం ఇస్తారు. ఈ మేరకు ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

రాయల్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ చినమిల్లి



డాక్టర్‌చినమిల్లిని అభినందిస్తున్న బండారు, కొత్తపల్లి, కొవ్వలి

నరసాపురం, సెప్టెంబరు 26: రాయల్‌క్లబ్ జాతీయ కార్యవర్గ అధ్యక్షులుగా డాక్టర్ చినమిల్లి సత్యనారా యణరావు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలోని తెలగా కళ్యాణ మండపంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకారానికి సంఘం పూర్వ అధ్యక్షులు సుంకర కృష్ణ విచ్చేసి చినమిల్లి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వంకా రవీంద్రనాథ్, మిరియాల వెంకటేశ్వరావు, పేటేటి పుల్లయ్య, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ బాబ్జీ, బండారు మాధవనాయుడు, టీడీపీ రాష్ట్ర నాయకులు కొవ్వలి నాయుడు, సంజయ్, పాపారావు నాయుడు విచ్చేశారు.

లడ్డూ ప్రసాదం దోషులపై చర్యలు తీసుకోవాలి

నరసాపురం రూరల్, సెప్టెంబరు 26: తిరుపతి లడ్డు ప్రసాదాన్ని అప్రవిత్రం చేసిన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు. లడ్డులో కల్తిని నిరసిస్తూ గురువారం మండలంలోని వేములదీవి వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేశారు. ఆలయంలో కోటి క్షమాపణ యజ్ఞంలో పాల్గొని 11సార్లు క్షమాపణ మంత్రం చదివి పూజలు చేశారు.

అత్తిలి: ఈడూరులోని వరాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా ప్రత్యేక పూజలు చేశారు. హరే శ్రీనివాసం కోలాట భజన కార్యక్రమం, విశ్వహిందూ పరిషత్ కార్యక్రమం, సాయంత్రం గరుడ వాహన సేవ నిర్వహించారు.

మెరుగైన ఉపాధికి ప్రయత్నించాలి

భీమవరం టౌన్, సెప్టెంబర్ 26 : జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల లబ్ధిదారులకు మెరుగైన ఉపాధి అవకాశాలను అందించడంలో సాంకేతికత, సౌర విద్యుత్‌ను వినియోగించేందుకు అవకాశాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా రంగాలలో ఉపాధి పొందుతున్న లబ్ధిదారులకు తక్కువ ఖర్చుతో, ఎక్కువ లాభాన్ని చేకూర్చే ఉపాధి అవకాశాలను జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలన్నారు. పాడి రైతు పశువులకు దాణ, తౌడు, ఉలవలు వినియోగం ఖర్చును తగ్గించేందుకు, మొక్క జొన్న గింజలు ద్వారా సగటున ఐదు, ఆరు రోజుల్లో పశుగ్రాసాన్ని పెంచుకునే విధానాన్ని సీఈఈడబ్ల్యూ పరిచయం చేస్తుందన్నారు.

వైసీపీ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం

పెంటపాడు, సెప్టెంబరు 26 : ఐదేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైపోయిందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. యానాలపల్లి, ఉమామహేశ్వరం గ్రామాలలో ఒక్కో గ్రామానికి రూ.99 లక్షల చొప్పున కేటాయించిన జలజీవన్ మిషన్ పైపు లైను పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి సర్పంచ్‌లు గోకా చాయాదేవి, మద్దుకూరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

పెంటపాడు, సెప్టెంబరు 26 : స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా గురువారం పెంటపాడు గోదావరి చైతన్య బ్యాంక్, పంచాయతీ ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. మేనేజర్ అరవింద్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి శోభన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ పూరేటి మృతి



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 26: సీనియర్ వైద్యులు పూరేటి రామ్మోహనరావు (86) గురువారం మృతి చెందారు. అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు విజయవాడ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. రామ్మోహనరావు ఐదు దశాబ్దాల పాటు వైద్య సేవలు అందించారు. ఆయన పార్థీవ దేహాన్ని ఆయన కోరిక మేరకు ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో వైద్య విద్యార్థుల పరీక్షల నిమిత్తం కుటుంబ సభ్యులు అందించనున్నారు.

ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పాలకొల్లు రూరల్/ఇరగవరం, సెప్టెంబరు 26: ప్రతీ విద్యార్థి ఆరోగ్యంపై శ్రద్ధ వహించడంతో పాటు అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి మహేశ్వర రావు అన్నారు. ఆగర్రు ఎంపీపీ పాఠశాలలో గురువారం బేటి బచావో... బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సాక గంగారత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఇరగవరం పీహెచ్‌సీని గురువారం డీఎంహెచ్‌వో సందర్శించారు. రోగుల గదులను, పరికరాల పనితీరు, మందుల లభ్యత తదితర వాటిని పరిశీలించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పెంటపాడు, సెప్టెంబరు 26 : భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని రైతు సంఘం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్.పుల్లారెడ్డి, సి.రంగారావు అన్నారు. రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం పెంటపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.